సాక్షి
హనుమకొండ
సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



టీఆర్‌ల జారీలో విజిలెన్స్ విచారణ

సీసీఐ పత్తి కొనుగోలు చేసేందుకు టీఆర్(టెంపరరీ రిజిస్ట్రేషన్)ల జారీలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. - 8లో▸



జాప్యమెందుకు?

తెలుగు విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా నియమించడానికి సీనియార్టీ తేల్చడంలో జాప్యం జరుగుతోంది. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34⁰/19⁰

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఎండవేడి, ఉక్కపోత ఉంటుంది. రాత్రి పూట చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

‘సంకటహర’ పూజలు



హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో ఆదివారం సంకటహరచతుర్థి పూజలు ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యాన వేదపండితులు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ప్రభాత పూజలు, శ్రీరుద్రేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం, సాయంత్రం 7 గంటలకు ఉత్తిష్టగణపతికి జల, క్షీర, పంచామృతం, నవరసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేపట్టారు. ఇష్టమైన గరికతో షోడశోపచార పూజలు చేశారు.

21 నుంచి మూడేళ్ల ‘లా’ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎల్‌ఎల్‌బీ మూడేళ్ల కోర్సు మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 21 నుంచి నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆసిమ్ ఇక్బాల్ తెలిపారు. ఈనెల 21, 24, 28, మార్చి 3, 5 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే ఎల్‌ఎల్‌బీ మూడేళ్ల కోర్సు ఐదవ సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 22, 25, మార్చి 1, 4, 6 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు మరో అవకాశం

విద్యారణ్యపురి: ఇంటర్మీడియట్ సైన్స్, ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఈనెల 3 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలకు వివిధ కారణాలతో హాజరుకాని విద్యార్థులకు ఇంటర్‌బోర్డు మరో అవకాశం కల్పించింది. ఈ మేరకు హనుమకొండ డీఐఈఓ ఎ.గోపాల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పింగిళి బాలికల జూనియర్ కళాశాలలో ఈ ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని, ఇప్పటివరకు పరీక్షలకు హాజరుకాలేని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేలా సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు సహకరించాలని కోరారు.

ముగిసిన ‘ఇన్నోథాన్-2.0’



కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లో నిర్వహిస్తున్న ‘ఇన్నోథాన్-2.0’ కార్యక్రమం ఆదివారం ముగిసింది. నిట్ వరంగల్, హిటాచీ ఎనర్జీ సంయుక్తంగా నిర్వహించిన 30 గంటల ఎనర్జీ ఇన్నోవేషన్ ఇన్నోథాన్‌లో వివిధ కళాశాలల నుంచి 120 మంది విద్యార్థులు పాల్గొని నూతన ఆవిష్కరణలకు పోటీపడ్డారు. ముగింపులో భాగంగా నిర్వాహకులు విజేతలకు బహుమతులు, నగదు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ వేణువినోద్ తదితరులు పాల్గొన్నారు.

నిట్‌లో ‘చిగురు-24’ వేడుకలు



కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్, యూత్ ఫర్ సేవా, యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన వరంగల్ నిట్‌లో ‘చిగురు-24’ వేడుకలు ఆదివారం జరిగాయి. నగరానికి చెందిన 12 ప్రభుత్వ పాఠశాలల నుంచి 1,200 మంది విద్యార్థులు పాల్గొని కళలు, క్రీడలు, సాహిత్య రంగాల్లో 15 రకాల పోటీల్లో ప్రతిభ చాటారు. ఇందులో విద్యార్థులు రూపొందించిన అయోధ్య రామ మందిర నమూనా విశేషంగా ఆకట్టుకుంది.

నేడు గ్రేటర్ గ్రీవెన్స్

వరంగల్: వరంగల్ మహా నగరపాలక సంస్థ కౌన్సిల్‌హాల్‌లో గ్రేటర్ గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధి ప్రజలు తమ సమస్యలపై విజ్ఞప్తులను కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నేడు వరంగల్ ప్రజావాణి

వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు తమ సమస్యలపై వినతులను కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

జాతర ముగిసినా.. తగ్గని భక్తుల రద్దీ





జంపన్నవాగులో షవర్ల కింద స్నానాలు చేస్తున్న భక్తులు



సారలమ్మ గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



తల్లులకు కోడి మొక్కు..



శివసత్తుల పూనకాలు..

మేడారం మినీ జాతర శనివారంతో ముగిసినా.. భక్తుల రద్దీ కొనసాగుతోంది. సమ్మక్క-సారలమ్మల దర్శనం కోసం ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అమ్మవార్ల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. ఈనెల 19న(బుధవారం) తిరుగువారం పండుగ నిర్వహించనున్నారు.

- ఎస్ఎస్ తాడ్వాయి

- వివరాలు 8లో▸

నీటి శుద్ధి.. అవినీతి బుద్ధి!

ఫిల్టరింగ్ పేరిట రూ.కోట్ల మేత

- 20 ఏళ్లుగా బల్దియాను శాసిస్తున్న బడా కాంట్రాక్టర్
- ఆతడికి అనుకూలంగానే టెండర్ నిబంధనలు
- ఆలమ్, క్లోరిన్ సరఫరాలో అక్రమాలు
- కొనేదానికి..వచ్చేదానికి వ్యత్యాసం

వరంగల్ అర్బన్: నీటి శుద్ధి పేరిట ప్రజాధనం పక్కదారి పడుతోంది. తెరవెనుక రహస్య ఒప్పందాల మేరకు లక్షల సొమ్ము చేతులు మారుతోంది. బల్దియా పాలకవర్గం అధికారుల గూడుపుఠాణితో ప్రజాధనం నీళ్లలా ఖర్చవుతోంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ఒకే ఒక్క కాంట్రాక్టర్‌ది ఆడింది ఆట.. పాడింది పాటగా నడుస్తోంది. ఉన్నతాధికారుల్ని మచ్చిక చేసుకోవడంలో, వారికీ వాటాలు పంచడంలో అతడిది అందెవేసిన చెయ్యి అని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పర్యవేక్షణ కరువు..

ఆలమ్, క్లోరిన్, సిలిండర్లు, బ్లీచింగ్ పౌడర్ సరఫరా సమయంలో ఎంత వచ్చిందో పర్యవేక్షించే నాథుడే కరువయ్యాడు. నీటి శుద్ధికి ఆలమ్ ఉపయోగించాల్సి ఉంటుంది. కానీ.. ఇక్కడ సిబ్బంది ఇష్టారాజ్యంగా కలుపుతున్నారు. ఏమోతాదులో కలపాలో కార్మికులకు తెలియక, పరీక్షలు చేయకపోవడంతో నల్లాల్లో నీరు కలుషితమవుతున్నదని ప్రజల్లో అపనమ్మకం ఉంది. అందుకే తాగడానికి మినరల్ వాటర్ ప్లాంట్ల నుంచి నీటిని కొనుగోలు చేస్తూ.. వ్యక్తిగత అవసరాలకు నల్లా నీటిని వినియోగిస్తున్నారు. అయితే మాకెందుకులే.. మాకొచ్చే సొమ్ము వస్తుంది కదా.. అన్నట్లుగా ఇంజినీర్లు, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. బల్దియా ఏడాదికి నీటి శుద్ధి కోసం రూ.2.50 కోట్లు వెచ్చిస్తోంది. అంతే కాకుండా.. ప్రజారోగ్యం విభాగంలో బ్లీచింగ్ పౌడర్ కోసం రూ. 80 లక్షల సొమ్ము ఖర్చు చేస్తోంది. ఈ రసాయనాలు సరఫరా చేసేది ఒకే వ్యక్తి కావడం గమనార్హం. రెండు, మూడు ఏళ్లుగా కాదు.. ఏళ్ల తరబడి అతడికి అనుకూలంగా టెండర్ నిబంధనలు రూపకల్పన చేస్తున్నారు. ఆయనకున్న లైసెన్స్‌లు, డీలర్ షిప్ తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని కాంట్రాక్టు దక్కేలా ఇంజనీరింగ్ విభాగంలోని డీబీ సెక్షన్ ఇంజనీర్లు, సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరిస్తుండడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంట్రాక్టు విధానం వెనుక పెద్ద ఎత్తున చేతులు మారుతున్నాయనే ఆరోపణలు సైతం వస్తున్నాయి.

ఉత్తుత్తి పరీక్షలే!

నీటి శుద్ధికి సంబంధించిన ప్రయోగశాలల జాడే నగరంలో కనిపించడం లేదు. వాస్తవానికి అన్ని చోట్ల అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నీటి పరీక్షలు నిర్వహించిన అనంతరం నల్లాలకు నీటి సరఫరా చేయాలి. కానీ.. దీనిపై ఇంజినీరింగ్ సిబ్బంది పెద్దగా దృష్టి కేంద్రీకరించడం లేదు. ఫలితంగా నగరంలోని పలు ప్రాంతాల్లో కలుషిత, బురద, దుర్వాసనతో కూడిన నీరు సరఫరా అవుతోంది. ఆనీరు తాగలేక ఇతర అవసరాలకు తీర్చుకుంటున్నారు. అపనమ్మకంతో తాగునీటి కోసం మినరల్ వాటర్ క్యాన్ల ద్వారా, ఇతర ప్లాంట్ల ద్వారా కొనుగోలుకు నగర ప్రజానీకం రూ.కోట్లు వెచ్చిస్తోంది. నీటి శుద్ధి పేరిట సాగుతున్న అవినీతి దందాపై మేయర్, కమిషనర్, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంపై విమర్శలు ఉన్నాయి.



ఫిల్టర్‌బెడ్‌లోని రా వాటర్



వ్యత్యాసం!

నగరంలోని దేశాయిపేట ప్రతాపరుద్ర, కేయూ రూద్రమాంబ, వడ్డేపల్లి, ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద తాగునీటి శుద్ధి చేసే ఫిల్టర్‌బెడ్లు ఉన్నాయి. ధర్మసాగర్ నుంచి వచ్చిన రా వాటర్ ఆయా ఫిల్టర్‌బెడ్ల ద్వారా శుద్ధీకరణ జరుగుతోంది. అందుకోసం వినియోగించే ఆలమ్, క్లోరిన్ మోతాదు నిబంధనలు పాటించిన దాఖలాలు ఎక్కడా కనిపించవు. వీటి పేరుతో రూ.కోట్ల సొమ్ము పక్కదారి పడుతోంది. లక్షల కేజీలు కొంటున్నట్లుగా చెబుతున్నా.. బయట మార్కెట్‌కు, కాంట్రాక్టర్‌కు సరాఫరా చేసే ధరకు కేజీకి రూ.10 నుంచి రూ. 20 వరకు తేడా ఉంటోంది.

తనిఖీ చేస్తాం..

నీటి శుద్ధి కోసం కొనుగోలు చేసే ఆలమ్, క్లోరిన్, బ్లీచింగ్ పౌడర్ సరఫరా, వినియోగాన్ని ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. ఏమైనా తేడాలొస్తే చర్యలు తీసుకుంటాం.

- ప్రవీణ్ చంద్ర, బల్దియా ఎస్ఈ

సదుపాయాలను వినియోగించుకోండి

- జస్టిస్ మౌసమీ భట్టాచార్య

వరంగల్ లీగల్: నిత్యం కోర్టుకు వచ్చే న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వసతులను సద్వినియోగం చేసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి, వరంగల్, హనుమకొండ జిల్లాల పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ మౌసమీ భట్టాచార్య అన్నారు. ఆదివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హైడ్రాలిక్ లిఫ్ట్, న్యాయవాదుల కారు పార్కింగ్ షెడ్లను జస్టిస్ భట్టాచార్య వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు నిర్మల గీతాంబ, సీహెచ్.రమేశ్ బాబు, రెండు జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, మాతంగి రమేశ్‌బాబు, కార్యదర్శి లడే రమేశ్, బార్ కౌన్సిల్ సభ్యుడు సిరికొండ సంజీవరావు, న్యాయవాద సంఘం ప్రతినిధులు, న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న జస్టిస్ మౌసమీ భట్టాచార్య

మెరుగైన సేవలతో వైద్య ఖర్చులు తగ్గించొచ్చు

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్

ఎంజీఎం/దామెర: ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలు ప్రజలకు మెరుగ్గా అందించడం వల్ల వారిపై వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించవచ్చని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. ఆదివారం ఆయన దామెర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ల్యాబ్, ఫార్మసీ, వ్యాక్సిన్ స్టోర్, ఆయుష్, ఎన్‌సీడీ, ఇతర విభాగాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం రవీంద్రనాయక్ మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో ప్రజలకు వివిధ ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించడం, పీహెచ్‌సీ సేవలు అందించడం ద్వారా వారు ఉన్నత స్థాయి వైద్య సేవలకు వెళ్లకుండా కాపాడవచ్చన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లోని 12 రకాల వైద్య సేవలు సక్రమంగా అందించాలని చెప్పారు. టీబీ, లెప్రసీ, ఎన్‌సీడీ కార్యక్రమాల్లో గుర్తించిన వారికి తగిన చికిత్సతో పాటు ఫాలోఆప్ సేవలు ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, పీఓడీటీటీ డాక్టర్ కె.లలితాదేవి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ హిమబిందు, డాక్టర్ ఇస్తేదార్ అహ్మద్, డాక్టర్ మంజుల, వైద్యాధికారి డాక్టర్ మహేంద్ర, డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, సీహెచ్ఎన్ లీల, సూపర్‌వైజర్లు శ్రీకాంత్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న డైరెక్టర్ రవీంద్రనాయక్

నేడు, రేపు యువజన క్రీడోత్సవాలు

వరంగల్ స్పోర్ట్స్: నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యాన ఈనెల 17, 18వ తేదీల్లో సుబేదారిలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో వరంగల్ జిల్లా స్థాయి యువజన క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌వైకే జిల్లా అధికారి చింతల అన్వేష్ ఒక ప్రకటనలో తెలిపారు. తాలూకా స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. యువకులకు వాలీబాల్, అథ్లెటిక్స్, షటిల్‌బ్యాడ్మింటన్, యువతులకు కబడ్డీ, షటిల్, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈపోటీల్లో పాల్గొనే క్రీడాకారుల వయస్సు 15 నుంచి 29 ఏళ్ల మధ్య ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు 93908 31502 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సేవలు మరింత చేరువ

- అందుబాటులోకి అప్లికేషన్ ట్రాకింగ్ సిస్టం
- విద్యుత్ వినియోగదారులకు తప్పిన తిప్పలు

హన్మకొండ: విద్యుత్ వినియోగదారులకు అత్యుత్తమ సేవలందించడంలో టీజీ ఎన్పీడీసీఎల్ పారదర్శకంగా, జవాబుదారీతనంతో వ్యవహరిస్తోంది. అందులో భాగంగా విద్యుత్ సర్వీసుల మంజూరును మరింత సులభతరం చేసింది. వినియోగదారులకు కొత్త సర్వీసుల మంజూరులో డాక్యుమెంటేషన్ సరిగ్గా లేకుంటే ఇప్పటి వరకు తిరస్కరిస్తూ వచ్చారు. ఇకపై ఏదైనా కారణంచేత దరఖాస్తు తిరస్కరణకు గురయ్యే అవకాశముంటే దాన్ని తిరస్కరించకుండా మంజూరుకు అవసరమైన ప్రక్రియను పూర్తి స్థాయిలో అందించేలా విద్యుత్ శాఖ మరో అవకాశం కల్పించింది. దరఖాస్తు చేసినప్పటి నుంచి అప్లికేషన్ ప్రాసెస్‌ను ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకునే వెసులుబాటును అందుబాటులోకి వచ్చింది. ఇదివరకు అప్లికేషన్ ఎక్కడి వరకు వచ్చిందో తెలియక దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ తిరిగేవారు. ట్రాకింగ్ సిస్టం అందుబాటులోకి వచ్చాక కార్యాలయం చుట్టూ తిరిగాల్సిన అవసరమే లేదని అధికారులు చెబుతున్నారు. వినియోగదారుడు సులభంగా తన అప్లికేషన్ నంబర్‌తో టీజీ ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్ నుంచి లేదా టీజీ ఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్ ద్వారా వివిధ దశల్లో ఉన్న అప్లికేషన్ స్థితిని తెలుసుకోగలుగుతారు. అయినప్పటికీ సంతృప్తి చెందకపోతే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.



వినియోగదారులకు మెరుగైన సేవలు



విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలందిస్తున్నాం. ఈక్రమంలో నూతన సర్వీసుల మంజూరును వేగవంతం, సులభతరం చేశాం. టీజీ ఎన్పీడీసీఎల్ అందిస్తున్న సేవల్ని వినియోగించుకోవాలి.

- కె.వెంకటరమణ, ఎస్ఈ, హనుమకొండ సర్కిల్

ఆధునిక సాంకేతికత..



వినియోగదారుల వద్దకు సాంకేతిక సేవలను తీసుకెళ్తున్నాం. విద్యుత్ సర్వీస్ మంజూరులోనూ సాంకేతికతను వినియోగిస్తున్నాం. మంజూరులో జరిగే ప్రతీ ప్రక్రియను వినియోగదారుడు తెలుసుకునేలా సౌకర్యం కల్పించాం.

- మధుసూదన్, ఎస్ఈ, వరంగల్ సర్కిల్

మురికివాడలు లేని నగరమే ధ్యేయం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: వరంగల్‌ను మురికివాడలు లేకుండా సుందర నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 4వ డివిజన్ పరిధి పెద్దమ్మగడ్డ, యాదవనగర్, జ్యోతిబసునగర్ కాలనీల్లో ఆదివారం పర్యటించిన ఆయన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రోడ్లు, సైడ్ డ్రెయినేజీల నిర్మాణం, తాగునీరు తదితర పనులన్నింటినీ దశల వారీగా పూర్తి చేస్తామని చెప్పారు. నాయకులు రాజేందర్, కుమార్ యాదవ్, శ్రీధర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాడేందుకే పోటీ

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుస్తాం..
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

హన్మకొండ: ‘ప్రజాసమస్యలపై పోరాడేందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం.. బీజేపీకి సానుకూల వాతావరణం ఉంది.. గెలుస్తాం’ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో విలేకరులతో, సత్యం కన్వెన్షన్‌లో జరిగిన మీట్ అండ్ గ్రీట్ విత్ టీచర్స్ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో ఈనెల 27న జరిగే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల్లో మూడు స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తున్నదని, పార్టీకి అనుకూలమైన వాతావరణం కనిపిస్తున్నదని చెప్పారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌పై పూర్తి వ్యతిరేకతతో ఉన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో అసంతృప్తిని మూటగట్టుకుంటే.. కాంగ్రెస్ ఏడాది కాలంలోనే ప్రజల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటున్నదని అన్నారు. గ్యారంటీలు, హామీల అమలులో.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. శాసనమండలి ప్రాధాన్యతను తగ్గించేలా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సభ్యులందరినీ మూకుమ్మడిగా తమ పార్టీలో చేర్చుకుని శాసన మండలి ఉద్దేశాలను దెబ్బతీశారని అన్నారు. నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ స్థానం నుంచి పులి సరోత్తంరెడ్డి, మెదక్-కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ స్థానం నుంచి కొమురయ్య, పట్టభద్రుల స్థానం నుంచి అంజిరెడ్డి బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారని, అందరూ విజయం సాధించి తీరుతారని పేర్కొన్నారు. సరోత్తంరెడ్డికి ఉపాధ్యాయుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందని, అన్ని సంఘాలు అభిమానించే వ్యక్తి ఆయన అని చెప్పారు. జేఏసీలోని సంఘాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి, నాయకులు వన్నాల శ్రీరాములు, ఆర్.పి.జయంత్‌లాల్, డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ కాళీప్రసాద్, గుజ్జ సత్యనారాయణ, చాడా శ్రీనివాస్‌రెడ్డి, చాడా సరిత, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కేంద్రం నుంచి నిధులు ఇప్పించాలి : ఎమ్మెల్యే నాయిని

ఇదిలా ఉండగా.. వరంగల్ మహానగర అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు ఇప్పించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు వేద బాంక్వెట్ హాల్ వద్ద ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. కేంద్ర నుంచి వరంగల్ మహానగరానికి వివిధ పథకాల కింద రావాల్సిన నిధులను విడుదల చేయించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కేంద్ర పురావస్తు శాఖలో ఉన్న వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి కిషన్‌రెడ్డి నిధుల విడుదలకు సహకరిస్తానని తెలిపారు. పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్‌రావు, ఈవీ శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించాలి

- మార్నింగ్ వాకర్స్‌ను కోరిన అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి

కేయూ క్యాంపస్: వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం కాకతీయ యూనివర్సిటీ క్రీడామైదానంలో మార్నింగ్ వాకర్స్, అధ్యాపకులను కలిసిన ఆయన.. తనను గెలిపిస్తే ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. శాసనమండలిలో గళమెత్తి పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీకి కృషిచేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, బాధ్యులు దేవిరెడ్డి, కొండారెడ్డి, డాక్టర్ కుందూరు సుధాకర్, మహేందర్‌రెడ్డి, విజయ్‌పాల్ పాల్గొన్నారు.



అధ్యాపకులను ఓటువేయాలని కోరుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి

ప్రజాప్రభుత్వంలో సోషల్ మీడియా పాత్ర కీలకం

- 'కాఫీ విత్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో నాయిని



కాఫీతో ఎమ్మెల్యే నాయిని, పీసీసీ సభ్యులు బత్తిని, ఈవీ, పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలు

హన్మకొండ చౌరస్తా: పదేళ్ల ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని అధికారంలో తీసుకురావడానికి సోషల్ మీడియా కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేశారని, ప్రజాప్రభుత్వ ఏర్పాటులో సోషల్ మీడియా పాత్ర కీలకమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ నేహాల్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో 'సోషల్ మీడియా వారియర్స్–కాఫీ విత్ ఎమ్మెల్యే' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సోషల్‌మీడియా విశేష కృషి చేసిందన్నారు. పదేళ్లలో సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసిన కార్యకర్తల పై అప్పటి ప్రభుత్వం కేసులు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. సోషల్‌మీడియా వారియర్స్ శ్రమను గుర్తించి తగిన ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో తొలిసారి 'కాఫీవిత్ ఎమ్మెల్యే కార్యక్రమం' చేపట్టడం అభినందనీయమన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, డాక్టర్ నాయిని గోదావిష్ణువర్ధన్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి రమేశ్, నాయకులు తిరుపతిరెడ్డి, జీవన్ రెడ్డి, హుస్సేన్, లక్ష్మి, భరత్, చందు, రమేశ్ పాల్గొన్నారు.





మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



దుకాణంలో ఆట బొమ్మలు కొనుగోలు చేస్తున్న మహిళలు

జాతర ముగిసినా.. తగ్గని భక్తుల జోరు



గంటకొడుతున్న భక్తులు

- మేడారానికి తరలివచ్చిన వేలాది మంది
- ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్ట చర్యలు
- 19న తిరుగువారం పండుగ

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క, సారలమ్మ మినీజాతర ముగిసినా భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. జంపన్న వాగు స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలు ఆచరించి పుట్ట వెంట్రుకలు సమర్పించుకున్నారు. అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మేడారం పరిసరాల్లో వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

ముందస్తు అంచనాతో అధికారుల ఏర్పాట్లు..



ముడుపు కడుతున్న మహిళ

మినీ జాతర అనంతరం ఆదివారం కూడా భక్తులు అధిక సంఖ్యలో మేడారానికి వస్తారని ముందస్తు అంచనాతో జిల్లా అధికారులు, పోలీస్ శాఖ తరఫున ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ రవీందర్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా భక్తుల ప్రైవేట్ వాహనాలను పార్కింగ్ స్థలాల్లోకి మళ్లించారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి భద్రత కట్టుదిట్టం చేశారు. పస్రా సీఐ రవీందర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి.. సిబ్బందిని సమన్వయ చేస్తూ బందోబస్తు నిర్వహించారు.

సరైన సమయంలో బస్సులు లేక భక్తుల ఇబ్బందులు

అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆదివారం వేలాదిగా తరలివచ్చిన భక్తులు సరైన సమయంలో ఆర్టీసీ బస్సులు లేక ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్‌లోనే పడిగాపులు కాశారు. తీరా ఒక్క బస్సు రాగానే ఎక్కేందుకు పోటీ పడ్డారు. ఈ సమయంలో మహిళలు, పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

సమన్వయంతో జాతర విజయవంతం

జిల్లా అధికారులు, పోలీస్ శాఖ, పూజారుల సమన్వయంతో మినీ జాతర విజయవంతమైందని మేడారం జాతర కమిటీ చైర్మన్ ఆరెం లచ్చుపటేల్ అన్నారు. ఈమేరకు ఆదివారం పూజారులతో కలిసి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. గోవిందరాజు, పగిడిద్దరాజులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీజాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంత్రి సీతక్క, జిల్లా ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేసి జాతర విజయవంతానికి కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా జాతర విజయవంతానికి సహకరించిన అధికారులు, సిబ్బంది, పూజారులకు కృతజ్ఞతలు తెలిపారు.

19న తిరుగువారం పూజలు

ఈనెల 19న (బుధవారం) తిరుగువారం పండుగ నిర్వహించనున్నారు. మినీజాతర (మండమెలిగె) పండుగ ముగిసిన అనంతరం మరోసారి అమ్మవార్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు తిరుగువారం పండుగ చేయడం ఆనవాయితీ. తిరుగువారం పండుగ రోజున మేడారం, కన్నెపల్లిలో పూజారులు, ఆదివాసీ కుటుంబాలు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

ఘనంగా 'స్వయంవర్' దశాబ్ది ఉత్సవాలు



జ్యోతి వెలిగించి ఉత్సవాలు ప్రారంభిస్తున్న నమఃశివాయ, పీఎస్ మూర్తి, తదితరులు

హన్మకొండ : హనుమకొండ నక్కలగుట్టలోని 'ది స్వయంవర్'లో దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ది స్వయంవర్ స్థాపించి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం 11వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ప్రముఖ వస్త్రవ్యాపారి కాసం నమఃశివాయ జ్యోతి వెలిగించి ఉత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ప్రథమంగా ఎత్నిక్‌వేర్ స్టోర్ ది స్వయంవర్‌ను స్థాపించామని చెప్పారు. ఈ స్టోర్ దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు 47 నగరాల్లో 85 బ్రాంచ్‌లుగా విస్తరించినట్లు పేర్కొన్నారు. వివాహాది శుభకార్యాలకు, పిల్లలకు, యువకులకు, పెద్దలకు అందుబాటులో కలెక్షన్స్ ఉన్నాయని తెలిపారు. అందుబాటు ధరల్లో షేర్వాణీ, ఇండో వెస్ట్రన్, జోధ్‌పురి బ్లాజర్స్, సెమీ ఇండో వెస్ట్రన్ కుర్తా, పైజామా, మోదీ సెట్, పట్టు పంచె, పగిడి, పెర్‌ఫ్యూమ్స్, దుపట్టా, లెనిన్ కుర్తాలు, షర్ట్‌లు తమ ప్రత్యేకత అని వివరించారు. డైరెక్టర్లు కాసం మల్లి కార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పీఎస్.మూర్తి, పుల్లూరు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్ధశతాబ్దపు అపూర్వ కలయిక..

- 54 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కురవి: ఆ విద్యార్థులు అర్ధ శతాబ్దం తరువాత కలుసుకున్నారు. 54 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం ఒకచోట కలిసి ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. అనంతరం జ్ఞాపకాలను నెమరువేసుకుని రోజంతా ఉల్లాసం, ఉత్సాహంగా గడిపారు. ఈ అపురూప ఘట్టానికి మండలంలోని బలపాల జెడ్పీ హైస్కూల్ వేదికైంది. పాఠశాలకు చెందిన 1971–1972 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కలియ తిరిగారు. తరగతి గదులను పరిశీలిస్తూ జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం తమతో చదువుకుని చనిపోయిన స్నేహితులకు శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కిలారి అశోక్‌బాబు, చింతలమోహన్‌రావు, చిక్కా వెంకటేశ్వర్లు, తాటికొండ మల్లారెడ్డి, రావూరి విమల, దార నర్సింహరావు, రావూరి రమేశ్, ఈడిగిరాల ఐలయ్య, బొల్ల వసంత, గరక వెంకటేశ్వర్లు, కె.పద్మ , నామా సైదులు, రావూరి ప్రభాకర్‌రావు, అంబటి వెంకటనారాయణ పాల్గొన్నారు.

చెస్‌తో మేధస్సు పెంపు

- ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- జిల్లా స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



ఆటతీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: చదరంగంతో మేధస్సు పెరుగుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీలను ఆదివారం ఎమ్మెల్యే నాయిని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. మానసికంగా ధైర్యంగా ఉన్నప్పుడే జీవితంలో వచ్చే ఆటుపోట్లను ఎదుర్కొంటామన్నారు. టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 170 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటల వరకు నాలుగు రౌండ్లు ముగియగా అందులో అల్లాడి శ్రీవాట్సన్, రజనీకాంత్, కొమురవెల్లి, వివేక్, ఆధ్య, రవీంద్రనాథ్ ముందంజలో ఉన్నారని తెలిపారు. టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, ఆర్బిటర్లు పాల్గొన్నారు.





జ్వరంతో విద్యార్థి మృతి

- ఆశ్రమ పాఠశాల వార్డెన్, హెచ్‌ఎం నిర్లక్ష్యమే కారణం: బంధువులు
- హాస్టల్ ఎదుట బంధువుల ఆందోళన



వినీత్ (ఫైల్)

వాజేడు: జ్వరంతో బాధపడుతూ వాజేడు మండల పరిధి పేరూరు బాలుర ఆశ్రమ హాస్టల్ విద్యార్థి సోయం వినీత్ (13) శనివారం రాత్రి మృతి చెందాడు. పేరూరు గ్రామానికి చెందిన వినీత్ ఊళ్లోని ఆశ్రమ హాస్టల్‌లో ఉంటూ అదే పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వినీత్‌కు మూడు రోజులక్రితం జ్వరం వచ్చింది. హాస్టల్లో ఒక మాత్ర ఇవ్వగా జ్వరం తగ్గింది. దీంతో ఇంటికి వచ్చాడు. ఇంటి వద్ద నీరసంగా ఉండడంతో అతడి మేన మామ ధర్మవరంలో ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించాడు. ఆర్‌ఎంపీ.. బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని.. వెంటనే మెరుగైన వైద్యం కోసం తీసుకెళ్లాలని సూచించాడు. దీంతో కారులో శుక్రవారం సాయంత్రం వినీత్‌ను ఏటూరు నాగారం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యం చేస్తుండగానే మృతి చెందాడు. మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చిన బంధువులు, కుటుంబ సభ్యులు వినీత్ మృతి చెందడానికి హాస్టల్ వార్డెన్, పాఠశాల హెచ్‌ఎం నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. జ్వరమొస్తే కుటుంబ సభ్యులకు తెలపకుండా మాత్ర వేసి పంపించడం ఏంటని ప్రశ్నించారు? అనంతరం బంధువులు, ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర నాయకుడు కొర్స నర్సిమూర్తి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకుడు ఉయిక శంకర్‌తో కలిసి ఆశ్రమ పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. విద్యార్థి మృతికి కారణమైన వార్డెన్ శ్రీను, హెచ్‌ఎం నాగరాజుపై చర్యలు తీసుకోవాలని, వినీత్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ నినదించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళన కొనసాగింది. వినీత్ కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు బాలుడి తల్లి శైల కుమారికి ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని వార్డెన్, హెచ్‌ఎం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

అదనపు కలెక్టర్ సంధ్యారాణి



సర్వే కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈఓ

వరంగల్: కులగణన సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి కోరారు. వరంగల్ నగరంలోని పోచమ్మమైదాన్, కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయం, కరీమాబాద్ మీసేవ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ప్రజాపాలన సేవా కేంద్రాలను అదనపు కలెక్టర్ ఆదివారం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో రీసర్వేలో నమోదు వివరాల తీరు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 28 వరకు సర్వే నిర్వహిస్తారని, ఇప్పటివరకు నమోదు కాని కుటుంబ సభ్యులు మాత్రమే సర్వేలో వివరాలు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం తిరిగి అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. వరంగల్‌లోని పోచమ్మమైదాన్ ఈసేవ కేంద్రం, కాశీబుగ్గ సర్కిల్ ఆఫీస్ కేంద్రం, కరీమాబాద్ మీసేవ కేంద్రం, నర్సంపేట తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతీరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 040-21111 1111 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి కూడా నమోదు చేయవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా https://seeepcsurvey.cgg.gov.in నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నింపి ప్రజాపాలన కేంద్రాల్లో అందించొచ్చన్నారు. ప్రజలు సర్వేకు సహకరించి పూర్తి వివరాలను ఇవ్వాలని కోరారు. జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, బల్దియా రెవెన్యూ అధికారి షాజాదీబేగం, పర్యవేక్షకులు హబీబుద్దీన్, ఆర్‌ఐ సోహైల్ పాల్గొన్నారు.

టీఆర్‌ల జారీలో 'విజిలెన్స్' విచారణ!

- ఇప్పటికే ఏడుగురిపై వేటు, త్వరలో మరికొందరిపై..
- వ్యవసాయశాఖ ప్రమేయంపై ఆరా
- ఉమ్మడి జిల్లాలో మరికొందరిపై వేటుకు మల్లగుల్లాలు



వరంగల్: సీసీఐ పత్తి కొనుగోలు చేసేందుకు టీఆర్ (టెంపరరీ రిజిస్ట్రేషన్)ల జారీలో పెద్ద మొత్తంలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించిన మార్కెటింగ్‌శాఖ రాష్ట్రంలోని ఏడుగురు మార్కెట్ కమిటీ కార్యదర్శులను సస్పెండ్ చేసిన విషయం విధితమే. వ్యవసాయ శాఖ అధికారులు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలతోనే కార్యదర్శులు టీఆర్‌లు జారీ చేసినట్లు గుర్తించిన మార్కెటింగ్ శాఖ మొత్తం ఈ వ్యవహారంపై నిజనిజాలను నిర్ధారించేందుకు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విచారణలో టీఆర్‌ల జారీలో ప్రమేయం ఉన్న వ్యవసాయ అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లతో పాటు మరికొంత మంది మార్కెట్ కార్యదర్శుల వ్యవహారం బహిర్గతమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఏఓల ఇష్టారాజ్యం..

రైతుల నుంచి పత్తిని సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు చేసేందుకు టీఆర్‌ల కోసం ధ్రువీకరణ పత్రాల జారీలో కొంత మంది వ్యవసాయ శాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పత్రాలు క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) మాత్రమే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి జారీ చేయాలని వ్యవసాయ శాఖ నుంచి స్పష్టంగా నిబంధన ఉంది. అయినప్పటికీ కొంత మంది ఏఓలు అడ్డగోలుగా ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఓ జిల్లాలో ఏకంగా ధ్రువీకరణ పుస్తకాన్ని ప్రింట్ చేయించినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోలు చేసే 80 మార్కెట్ కమిటీల్లో టీఆర్‌ల జారీపై మార్కెటింగ్ శాఖ అధికారులు విచారణ చేపట్టగా నిబంధనల పట్టించుకోకుండా సుమారు 46 వేలకు పైగా టీఆర్‌లు జారీ అయినట్లు అధికారులు గుర్తించారు. 20 మార్కెట్ కమిటీల్లో ఈ వ్యవహారం జరిగినట్లు గుర్తించినప్పటికీ ఫిర్యాదు వచ్చిన మార్కెట్ కమిటీ కార్యదర్శులను మొదటి విడతగా సస్పెండ్ చేశారు. రెండో విడత మరికొంత మందిపై వేటు పడే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విచారణలో వ్యవసాయ అధికారుల ప్రమేయం బహిర్గతమైతే వారిపై చర్యలు తప్పవన్న చర్చ సాగుతోంది.

అమెరికా అమ్మాయి.. నీరుకుళ్ల అబ్బాయి



వధూవరులతో వరుడి తల్లిదండ్రులు

హన్మకొండ చౌరస్తా: అమెరికా దేశంలోని టొరంటోకు చెందిన జెస్సికా, హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన సతీష్ వివాహం ఆదివారం హనుమకొండలోని పెద్దమ్మగడ్డ సమీప ఏఆర్ఆర్ గార్డెన్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. హిందూ సంప్రదాయం ప్రకారం నిర్వహించిన ఈ వివాహానికి అమ్మాయి తల్లి, సోదరి మరో ఇద్దరు బంధువులు, వరుడి తరఫు బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన సతీష్‌కు 2021 సంవత్సరం కరోనా సమయంలో నిర్వహించిన పలు సామాజిక కార్యక్రమాల్లో జెస్సికా పరిచయం అయింది. అది కాస్త పెళ్లి వరకు వెళ్లింది. ఇద్దరి మనసులను అర్థం చేసుకున్న ఇరువురి తల్లిదండ్రులు వేదమంత్రాల సాక్షిగా వివాహతంతు జరిపించి ఒక్కటి చేశారు. ఈ వివాహ వేడుకను చూసిన బంధువులు, స్నేహితులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

సీనియార్టీ తేల్చడంలో జాప్యమెందుకు?

- కమిటీని నియమించి రెండువారాలు
- ఇంకా సమర్పించని నివేదిక
- తెలుగు అధిపతి, బీఓఎస్ నియామకమెప్పుడు?
- నేడు కమిటీ సమావేశమయ్యే అవకాశం!

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో తెలుగు విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ ఏటూరి జ్యోతి ఈఏడాది జనవరి 9న మృతి చెందిన విషయం విధితమే. అయితే ఆ విభాగంలో రెగ్యులర్ ప్రొఫెసర్లు లేరు. నలుగురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు మామిడి లింగయ్య, మంథిని శంకర్, చిర్రరాజు, కర్రె సదాశివ్ ఉన్నారు. ఆ నలుగురిలో సీనియార్టీ ప్రాతిపదికన ఒకరిని విభాగం అధిపతిగా, మరొకరిని బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌గా నియమించాల్సింటుంది. అయితే ఆ నలుగురు కూడా ఆ పదవులు ఆశిస్తున్నారు. ఒకరిపై మరొకరు ఆరోపణలు చేస్తూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వీరిలో ఎవరిని విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌గా నియమించడానికి సీనియార్టీ తేల్చాలని వీసీ ఓ కమిటీని నియమించాలని నిర్ణయించారు. దీంతో ఈ ఏడాది జనవరి నెలాఖరులో అప్పటి రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి ఈ కమిటీని నియమిస్తూ వారం రోజుల్లో రిపోర్టు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కమిటీని నియమించి రెండు వారాలు గడిచినా ఇప్పటివరకూ రిపోర్టు ఇవ్వలేదు. దీంతో ఈ కమిటీని నియమించింది కాలయాపనకేనా? ఇంకెప్పుడు సీనియార్టీని తేలుస్తారని ఆ నలుగురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రశ్నిస్తున్నారు. జాప్యం చేయడంలో ఆంతర్యమేమిటీని యూనివర్సిటీలో చర్చ సాగుతోంది. అయితే కమిటీ మాత్రం ఆరోపణలు పట్టించుకోదని, తాము ఆ నలుగురిలో సీనియార్టీని మాత్రమే పరిశీలించి త్వరలోనే రిపోర్టు అందజేస్తామని కమిటీలో ఉన్న ఓ ప్రొఫెసర్ పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈనెల 17న కమిటీ సమావేశమై సీనియార్టీని తేల్చి రిపోర్టు ఇవ్వాలని నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కాగా, ఆ నలుగురిలో ఎవరు విభాగం అధిపతి, బీఓఎస్‌గా నియామకం అవుతారనే అంశం యూనివర్సిటీలో ఆసక్తికరంగా మారింది.

26న ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనం



సమ్మేళనం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అర్చకుడు శేషు, రాకేశ్‌రెడ్డి

- భద్రకాళి దేవాలయం ప్రధాన అర్చకుడు శేషు

హన్మకొండ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 26న ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు భద్రకాళి దేవాలయం ప్రధాన అర్చకుడు శేషు తెలిపారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓరుగల్లు వైభవాన్ని, శివతత్వాన్ని చాటేలా ఆధ్యాత్మిక నిలయమైన ఓరుగల్లు గడ్డ మీద ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ప్రతి సంవత్సరం మాదిరిగానే మహా శివరాత్రి సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమంలో ఓరుగల్లు ప్రజలంతా భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాకేశ్‌రెడ్డితోపాటు గేయ రచయిత వెన్నెల శ్రీనాథ్, శాస్త్రీయ నృత్య కళాకారిణి చిరంజీవి హిమాన్సీ కాట్రగడ్డ, ఇండస్ ఫౌండేషన్ మహాశివరాత్రి కార్యక్రమ కోఆర్డినేటర్‌లు పాల్గొన్నారు.

జాతీయవాద రచనలకు కేంద్రబిందువు సదాశివరావు

- ప్రముఖ రచయిత వరిగొండ కాంతారావు



కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులు

హన్మకొండ కల్చరల్ : జాతీయవాద రచనలకు కేంద్రబిందువు స్వర్గీయ భండారు సదాశివరావు అని ప్రముఖ రచయిత వరిగొండ కాంతారావు అన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ పూర్వ అధ్యక్షుడు భండారు సదాశివరావు స్మారకగా ఆదివారం హంటర్‌రోడ్‌లోని శ్రీవ్యాస ఆవాసంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ప్రముఖ కవి, రచయిత డాక్టర్ భండారు ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 'హిందువుగా జీవించు–హిందువునని గర్వించు' అనే అంశంపై నిర్వహించిన కవితా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. భండారు సదాశివరావు రచనలు 'అగ్నిమూర్తులపై' ప్రముఖ రచయిత ఐత చంద్రయ్య, 'పృథ్వీసూక్తం'పై వరిగొండ కాంతారావు ప్రసంగించారు. కార్యక్రమంలో శ్రీవ్యాస ప్రతిష్టాన్ సంఘం ప్రధాన బూర రాయచందర్, జాతీయ సాహిత్య పరిషత్ హనుమకొండ శాఖ ప్రధాన కార్యదర్శి తాడిచెర్ల రవి, ప్రముఖ వైద్యులు డాక్టర్ బీఎస్ శివసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.